ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
గురువారం 20 ఫిబ్రవరి 2025



నేడు మాతృభాష పరిరక్షణపై చర్చా వేదిక

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పాశ్చాత్య సంస్కృతి, మాతృభాష పరిరక్షణ పేరిట 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు హిమాలయ ఫంక్షన్ హాల్‌లో డీఈవో ఏ.రమేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి విద్యావేత్తలు, కవులు, కళాకారులు హాజరుకానున్నారు.

నీరు లేకనే.. వెనుకబాటు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పక్కనే ఉన్న నది నుంచి నీళ్లివ్వకుండా టేలెండ్ చేసే ఉద్దేశంతో పీఆర్ఎల్ఐని చేపట్టారు
- అందుకే జీవో 69ని పక్కన పెట్టారు..
- ఇప్పుడు శరవేగంగా నారాయణపేట-కొడంగల్ లిఫ్టు పనులు
- సంవత్సరాల వారీగా లక్ష్యాలు.. ఏడాదిలో రూ.300 కోట్లు మంజూరు
- విద్య, వైద్య రంగాలు మొదటి ప్రాధామ్యాలుగా భావించి అధిక శ్రద్ధ
- నర్సింగ్, ఎంసీహెచ్ మంజూరు చేయించాను.. త్వరలో నిర్మాణ పనులు
- కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూల్ కోసం ప్రతిపాదనలు ఉన్నాయి
- గతంలో ఆస్పత్రులు పేరుకే అప్‌గ్రేడ్.. సౌకర్యాలు అంతంతమాత్రమే..
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నీటి చుట్టూనే నాగరికత ఉంటుంది. అభివృద్ధి జరుగుతుంది. నీరు లేని ప్రాంతాల్లో వెనుకబాటు పరిపాటిగానే ఉంటుంది. నారాయణపేటది కూడా ఇంచుమించుగా అదే పరిస్థితి. పక్కనే కృష్ణా నది పారుతున్నప్పటికీ ఏళ్లుగా ఈ ప్రాంతం సాగు నీటికి నోచుకోలేదు. ఫలితంగా వలసలు, వెనుకబాటుతనం.. దానితోపాటు ఏర్పడే అన్నింటినీ ఈ ప్రాంతం అనుభవిస్తూ వస్తోంది. ఈ ప్రాంతానికి సాగునీరు ఇవ్వాలనేది మా తాత చిట్టెం నర్సిరెడ్డి ఆకాంక్ష. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవో నెంబర్ 69 ద్వారా నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం మంజూరైంది. కానీ ఈ ప్రాంత అభివృద్ధి మీద ఆసక్తి లేని గత ప్రభుత్వం.. ఆ లిఫ్టును పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు వేగంగా నడుస్తున్నాయి. వెనుకబాటులో ఉన్న రెండు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈ సంవత్సర కాలంలో విద్య, వైద్యరంగాలను ప్రాధామ్యాలుగా భావించి.. ముందుకు సాగుతున్నాను. సంవత్సరాల వారీగా గోల్స్ పెట్టుకున్నా. ఏడాదిలో రూ.300 కోట్లు మంజూరు తీసుకువచ్చి, లక్ష్యం నెరవేర్చుకున్నాను. రేపు జరగబోయే సీఎం సభలో జిల్లాకు మరో రూ.వెయ్యి కోట్ల మంజూరు వస్తుందని భావిస్తున్నాను.' అని అంటున్నారు నారాయణపేట శాసన సభ్యురాలు చిట్టెం పర్ణికారెడ్డి. బుధవారం ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు..

కొత్త మండలాల ఏర్పాటు ఎంత వరకు వచ్చింది?

నేను ఎన్నికల సమయంలో కొత్త మండలాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాను. దానికి కట్టుబడి ఉన్నాను. సీఎం వద్ద ఇప్పటికే ప్రతిపాదనలు ఉన్నాయి. గతంలో మండలాలు, జిల్లాల విభజన అనుకున్న రీతిలో జరగలేదు. ఇప్పుడు జనాభా, మండలాభివృద్ధికి కావాల్సిన సదుపాయాలు, వనరులు ప్రాధాన్యంగా తీసుకుని పకడ్బందీగా మండలాల ఏర్పాటు ఉంటుంది.

సంవత్సరం గడిచింది.. విద్యార్థిగా, ఎమ్మెల్యేగా తేడా ఏం చూస్తున్నారు?

ఎన్నికల ముందు వరకు నాది మొత్తం విద్యార్థి జీవితం. కుటుంబం, బాబును చూసుకోవడం అంతవరకే ఉండేది. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం అయినప్పటికీ.. ఇప్పుడున్నంత అవగాహన ఆ రోజుల్లో లేదు. ఎన్నికల సమయంలో, గెలిచిన తర్వాత కుటుంబానికి సమయం ఎక్కువగా ఇవ్వలేకపోతున్నాను. అయితే ప్రతీ రోజూ కొత్తదిగా భావిస్తూ, నేర్చుకుంటున్నారు. ప్రజాక్షేత్రంలో ఎదురయ్యే సమస్యలు, ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, వాటి పరిష్కారంలో తీసుకునే చర్యలు, స్థితప్రజ్ఞతతో ఎలా పని చేయాలనే విషయాలను బాగా అర్థం చేసుకుంటున్నాను.

గోల్ఫ్ కాంప్లెక్స్, టెక్స్‌టైల్ పార్క్ పరిస్థితి ఏంటి?

నారాయణపేటలో సరాఫ్ బజార్ చాలా పేరు ఉన్న ప్రాంతం. వారు ఒప్పుకుంటే వేరేచోటికి తరలించవచ్చు. కానీ కొన్ని పేర్లు అలాగే మిగిలిపోవాలి. హైదరాబాద్‌లో కూడా ఇప్పటికీ నగరం ఎంత అభివృద్ధి చెందినా పాత మార్కెట్‌లు ఇంకా అలాగే కొనసాగుతున్నాయి. ఆ మార్కెట్ల వల్ల ప్రాంతాలకు పేరు వస్తుంది. ఇక టెక్స్‌టైల్ పార్కు సింగారం చౌరస్తా వద్ద నడుస్తోంది. దాన్ని స్కేల్ చేసి, ఇంకా పెంచడానికి చూస్తున్నాం. అన్నింటికీ నీరే మూలం కాబట్టి.. ముందుగా నీటి వసతి సమకూర్చిన తర్వాతే పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుంది.

ఈ ప్రాంతానికి నీరు జీవన్మరణ సమస్యగా ఉంది. నారాయణపేట ఎత్తిపోతల పనులను ఎంత సీరియస్‌గా తీసుకున్నారు?

కొడంగల్- నారాయణపేట నియోజకవర్గాలు రెండూ నీరు లేక వెనుకబాటులో ఉన్న ప్రాంతాలే. పదేళ్ల క్రితమే ఈ ప్రాంతాలకు నీరిచ్చే అవకాశం దక్కింది. కానీ పాలమూరు-రంగారెడ్డిని రీడిజైన్ చేసి, పక్కనే ఉన్న నది నుంచి నీరివ్వకుండా శ్రీశైలం నుంచి చుట్టూ తిరిగి తీసుకురావాలని డిజైన్ చేశారు. దానివల్ల నారాయణపేట టేలెండ్ ప్రాంతం అవుతుందనేది అప్పటి పాలకులు గుర్తించ లేదు. టేలెండ్‌కు నీరు రావడం చాలా కష్టమని అనుభవాలు కూడా చెబుతున్నాయి.

సర్వే అడ్డగింపులు.. నిర్మాణం ఎలా ఉంది?

ఏ ప్రాజెక్టు కట్టాలన్నా భూసేకరణ చాలా ముఖ్యం. ప్రజలు తమకు ఆధారమైన భూమిని కోల్పోతుంటే హక్కు కాబట్టి.. నిరసన తెలుపడం

(మిగతా 6లో..)



మృతి చెందిన బ్రాయిలర్ కోళ్లను ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతలో వేస్తున్న దృశ్యం

బర్డ్‌ఫ్లూ కలకలం?

- వైరస్‌తో 4 వేలకు పైగా బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత
- మదనాపూర్ మండలం కొన్నూరు గ్రామంలో ఘటన
- కోళ్లను పరిశీలించిన పశు సంవర్ధక శాఖ అధికారులు
- కొక్కెర వైరస్‌తోనే మృతి చెందాయంటున్న అధికారులు
- పరీక్షల కోసం ల్యాబ్‌కు శాంపిల్స్
- ఉలిక్కిపడ్డ పౌల్ట్రీ యజమానులు

6



శివ కేశవరెడ్డి కోళ్ల ఫారంలో మృతి చెందిన బ్రాయిలర్ కోళ్లు

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

- ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం అడిషనల్ ఎస్పీ భాస్కర్
- మత్తుకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు
- ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి

వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు



6

వాటర్‌మిలన్ వచ్చేసింది

వేసవి సమీపిస్తుండటంతో ఎండలు ముదురుతున్నాయి. వాటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు పండ్ల రసాలను తాగడంతో పాటు పండ్లను తింటున్నారు. ఎండకాలంలో విరివిగా లభించే కలంగిరి(వాటర్ మిలన్), కర్బూజ పండ్లు మార్కెట్‌లో విక్రయానికి వచ్చాయి. చలికాలం ముగిసి వర్షాకాలం ఆరంభం అయ్యేవరకు దాదాపు మూడున్నర నెలల పాటు లభించే ఈ పండ్లకు ఫుల్ గిరాకీ ఉంటుంది. రైతులు, వ్యాపారులు దేవరకద్ర మండలం గూరకొండ గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా కలంగిరి, కర్బూజ పండ్లను అమ్ముతున్నారు. వాటిని కొనేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్, మహబూబ్‌నగర్









విక్రయానికి ఉంచిన వాటర్ మిలన్, కర్బూజ పండ్లు

లింగాలలో కమ్యూనిటీ కాంటాక్ట్

- 40 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నాగర్‌కర్నూల్ అడిషనల్ ఎస్పీ రామేశ్వర్‌రావు



7

దళితుల ఆర్థికాభివృద్ధి కోసమే ఎస్సీ కార్పొరేషన్

- బ్యాంక్ లింకేజీతో రూ.3.66 కోట్ల సబ్సిడీ రుణం
- 251 మందికి 684 ఎకరాల భూమి పంపిణీ
- త్వరలో 78 యూనిట్ల గేదెల పంపిణీకి సిద్ధం
- ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్‌బాబు

6

భద్రత పటిష్టంగా ఉండాలి

- ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ బీఎం సంతోష్



స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం జోగుళాంబ గద్వాల కలెక్టర్ కార్యాలయ ఆవరణ వద్దగల గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవీఎం)లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌తో పాటు భద్రత నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అంతేకాకుండా భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

కారు, బైకు ఢీ.. ఇద్దరి మృతి

- మృతులు తెలకపల్లి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శ్రీను, శేఖర్
- ప్రమాదానికి గురైన కారు తెలకపల్లి మండలం కార్వంగకు చెందినట్లుగా గుర్తింపు

7

ఇందిరమ్మ ఇళ్లు నచ్చినట్లు నిర్మించుకోవచ్చు

- లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టాలి : కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఈర్లదిన్నెలో లబ్ధిదారుడికి సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు నచ్చిన విధంగా నిర్మించుకోవచ్చునని, ప్రభుత్వ నిబంధనలు కూడా పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని ఈర్లదిన్నె, శ్రీరంగాపురం మండలాల్లోని నాగసానిపల్లి గ్రామాల్లో పర్యటించారు. పంచాయతీ కార్యాలయాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగసానిపల్లిలో 156 మంది లబ్ధిదారులు, ఈర్లదిన్నెలో 72 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. మంజూరు ప్రత్రాలు తీసుకున్న లబ్ధిదారులు తక్షణమే ఇంటి నిర్మాణం పనులు చేపట్టాలని సూచించారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణం నుంచి ఎక్కువ స్థలంలో నిర్మించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పర్వతాలు, తసీల్దార్లు లక్ష్మి, మురళీ, ఎంపీడీవో రవీందర్ ఉన్నారు.

ధైర్య సాహసాలకు పెట్టింది పేరు శివాజీ మహరాజ్

- ఐతోల్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన సినీ దర్శకుడు నాగ్ అశ్విన్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



ఐతోల్ గ్రామంలో శివాజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాగ్ అశ్విన్, ఎమ్మెల్యే కూచకుళ్ల

తాడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అరాచకాలను అంతమొందించాలని ఛత్రపతి శివాజీ మహరాజ్ ధైర్య సాహసాలతో పోరాడారని సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామంలో సినీ దర్శకుడు నాగ్ అశ్విన్, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ మాట్లాడుతూ విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిందిగా కోరారు. ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రారంభోత్సవానికి ఆహ్వానించిందుకు గ్రామస్థులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ సేవలు మరువ లేనివని, ధైర్య సాహసాలకు పేరొందిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన అందించిన అలనాటి సేవల వల్లే ప్రస్తుతం మనం ప్రశాంత మైన వాతావరణంలో జీవిస్తున్నామని తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఐతోల్, మంగనూరును నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలంటూ రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, సింగిల్ విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు, నాగ్ అశ్విన్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీరు లేకనే వెనుకబాటు

(5వ పేజీ తరువాయి)



లేదా డిమాండ్లు ముందుంచడం చాలా కామన్ సమస్య. ప్రస్తుతం సర్వే నడుస్తోంది. నేను స్వయంగా రైతుల వద్దకు వెళ్లి, మాట్లాడి ఒప్పిస్తున్నాను. కేవలం ఒప్పించి పని చేయడానికి మాత్రమే మేము ప్రయత్నిస్తున్నాం. ఈ ప్రాంత అభివృద్ధికి, సాగునీరు రావడానికి రైతులు కూడా సహకరించాలి. అలాగే ప్రాజెక్టు మంజూరైన వెంటనే గ్రౌండింగ్ చేయడం వంటివి కష్టమవుతుంది. ఇప్పటికే డిజైన్, టెండర్లు పూర్తయ్యాయి. సర్వే పూర్తయితే పనులు ప్రారంభిస్తాం.

కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం ఎప్పటివరకు అందుబాటులో వస్తాయి?

ప్రస్తుతం కలెక్టరేట్ పనులు వేగంగా సాగుతున్నాయి. త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. ఎస్పీ కార్యాలయం కోసం గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేదు. గతంలో తెచ్చాం.. ఇంకా పూర్తి కాలేదు అనడం సరికాదు. ప్రభుత్వ పని అంటే అది నిరంతర ప్రక్రియగా ఉంటుంది. ఎవరి హయాంలో వారు తాము చేసే పనిని చేస్తారు. అలాగే సీఎం పర్యటన సందర్భంగా జిల్లాలో పలు భవనాల నిర్మాణాలకు మంజూరు వస్తుంది. ధన్వాడలో డిగ్రీ కాలేజీ భవనం, జూనియర్ కాలేజీ, మరికల్ జూనియర్ కాలేజీ, ఎంసీహెచ్, నర్సింగ్ కాలేజీ, జీజీహెచ్ భవనం వంటివి చాలా మంజూరు అవుతాయి. జిల్లా మొత్తానికి కలిపి దాదాపు రూ.వెయ్యి కోట్ల పనులు వస్తాయి.

ఏయే రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు?

అన్ని రంగాలను సమాంతరంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. కానీ విద్య, వైద్యరంగాలకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. మెడికల్ కాలేజీ చాలా దూరంలో ఉంది. ఈ సంవత్సరం అనుమతులు తేవడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. అలాగే ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. పీడియాట్రిక్ విభాగం ఓవర్ క్రౌడ్ ఉన్న ప్రాంతంలో ఉంది. సెంట్రలైజ్ కావడంతో ఇబ్బందిగా మారింది. అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నాం. ఇటు దామరగిద్ద రోడ్డు, అటు ఎక్లాస్‌పూర్ వైపు, సింగారం వైపు అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు ఉన్నాయి.

సైనిక్, కేంద్రీయ, నవోదయ విద్యాలయాల పరిస్థితి ఏంటి?

జిల్లాకు ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైంది. సైనిక్ స్కూల్ గతంలో మంజూరైంది. తర్వాత దాన్ని అమలు చేయకపోవడం వల్ల వాపస్ పోయింది. మళ్లీ ఎంపీ డీకే అరుణతో కలిసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. నవోదయ కూడా కావాలని అడిగాం. మహబూబ్‌నగర్‌కు మంజూరైందన్నారు. కానీ జిల్లాకు ప్రత్యేక నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు సాధించడం కోసం అన్ని ప్రతిపాదనలు కేంద్రానికి పంపించాం. త్వరలో వీటిలో కొన్నింటికి అనుమతి వస్తుందని ఆశిస్తున్నాం.

ఆస్పత్రుల అభివృద్ధి ఎలా ఉంది?

గతంలో పీహెచ్‌సీలను సీహెచ్‌సీలు, సబ్ సెంటర్లను పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను ఏరియా ఆస్పత్రులుగా మార్చారు. కాగితాల్లో మార్చారు. కొన్నిచోట్ల భవనాలు నిర్మించారు. కానీ టీవీవీపీ నుంచి డీఎంఈకి మారడానికి, వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వలేదు. అప్‌గ్రేడ్‌కు కావాల్సినంత ప్రాసెస్ జరుగలేదు. అందువల్లనే చాలా చోట్ల ఈ ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. మేము ప్రణాళికాబద్ధంగా వీటన్నింటినీ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలో జీజీహెచ్, ఎంసీహెచ్ కొత్త భవనాలు, నర్సింగ్ కాలేజీ నిర్మాణాలు ప్రారంభమవుతాయి. కోయిల్‌కొండ ఆస్పత్రిని కూడా అభివృద్ధి చేస్తాం.

ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మిస్తున్నారా?

ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన జరిగింది. టెండర్లు కూడా అయ్యాయి. త్వరలోనే పనులు కూడా ప్రారంభమవుతాయి. జిల్లా అభివృద్ధిలో భాగంగా అతిథి గృహాలు కూడా ముఖ్యమేనని మేము భావిస్తున్నాం.

నారాయణపేట మున్సిపాలిటీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

హైదరాబాద్ తర్వాత నారాయణపేటనే మునిసిపాలిటీ అయ్యిందని అంటారు. అలాంటి మునిసిపాలిటీని ఏళ్లుగా పట్టించుకోలేదు. ప్రస్తుతం సెంట్రలైజ్డ్‌గా అభివృద్ధి పనులు ఉన్నాయి. వాటిని వికేంద్రీకరించడం ద్వారా పట్టణ విస్తరణ జరుగుతుంది. ఎక్లాస్‌పూర్, దామరగిద్ద, ధన్వాడ వైపు అభివృద్ధి పెరుగుతుంది. అలాగే సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నాం. వచ్చిన ఫండ్స్‌లో మెజారిటీ వినియోగిస్తున్నాం. ముందుగా డ్రెయిన్ వేసిన తర్వాత సీసీ వేయాలని సూచిస్తున్నాం. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనలు కూడా పెట్టడం జరిగింది. వచ్చే బడ్జెట్‌లో నిధులు మంజూరు కావొచ్చు.

ప్రతీ తండాకు, గ్రామానికి రోడ్ల విషయంలో ఫోకస్ ఎలా ఉంది?

ఇది మా విజన్ మాత్రమే కాదు.. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ప్రతీ తండాకు, గ్రామానికి బీటీ రోడ్డు ఉండాలనే సంకల్పంతో ఉన్నారు. ఇప్పటికే రోడ్ల పనులు జరుగుతున్నాయి. ధన్వాడ రోడ్డు జాతీయ రహదారి అయితే మరింత విస్తరణ జరుగుతుంది. వచ్చే నాలుగేళ్లలో ఈ లక్ష్యం నెరవేరుతుందని మేము భావిస్తున్నాం.

వచ్చేనెల 8న జాతీయ లోక్ అదాలత్

● మహబూబ్‌నగర్ జిల్లా న్యాయాధికారి పాపిరెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి పాపిరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి పాపిరెడ్డి

లోక్ అదాలత్‌లో కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, మోటార్ వెహికిల్ ప్రమాద పరిహార కేసులు, ఇన్సూరెన్స్ కంపెనీల కేసులు, ఎలక్ట్రిసిటీ, భూ వివాదాలు మరియు ట్రాఫిక్ చలానా, డ్రంకెన్ డ్రైవ్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులలో రాజీ కుదర్చడం జరుగుతుందని వివరించారు. ఇప్పటికే 2029 కేసులను గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు, పోలీసుశాఖతో ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇది వరకు నిర్వహించిన లోక్‌అదాలత్‌లో జిల్లాలో 14,705 కేసులు రాజీ చేయడం జరిగిందని, ఇప్పుడు అంతకన్నా ఎక్కువ కేసులు రాజీ అయ్యేందుకు సహకరించాలని కోరారు. లోక్‌అదాలత్‌లో రాజీ అయితే కోర్టు ఫీజు ఉండదని, మళ్లీ ఈ కేసులపై అప్పీలు ఉండదని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

ముడాతో మరింత అభివృద్ధి



మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం

- ● రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ
- ● 5 నియోజకవర్గాలు.. 204 గ్రామాలు
- ● 10 ఎకరాల లేఅవుట్‌లకు.. 600 గజాలలోపు భవనాలకు అనుమతులు
- ● ఇప్పటి వరకు రూ.41 కోట్ల ఆదాయం
- ● అందులో గత పాలక మండలి రూ.12 కోట్లు ఖర్చు..
- ● శాశ్వత పనులపై దృష్టి
- ● ఏజెన్సీల సహకారంతో 50 బస్టాప్‌ల నిర్మాణానికి కృషి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)తో పాలమూరు మరింత అభివృద్ధి చెందనుంది. ముడా అంటే చాలా మందికి అవగాహన ఉండదు. తమ గ్రామం ముడా పరిధిలో ఉందన్న సంగతే మూడోవంతు ప్రజలకు తెలియదు. అసలు ముడా అంటే ఏమిటి?, ముడాకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి?, ఆ నిధులను వేటికి వెచ్చిస్తారు?, కార్పొరేషన్, మునిసిపాలిటీలు ఉండగా ముడాతో పనేంటని చాలామందిలో కొంత గందరగోళం ఉంటుంది. అయితే కార్పొరేషన్, మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీలతో సంబంధం లేకుండానే ముడా తన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వేటి పాలన వాటికి నిర్దేశించబడింది. ఇదివరకు పెద్దపెద్ద అనుమతులకు హైదరాబాద్ వెళ్లి, అక్కడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి అనుమతులలో మూడో వంతు ముడా ద్వారానే చేసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా ముడాకు నిధులు సమకూరడంతోపాటు ఆ నిధులను పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించవచ్చు. దీన్ని బట్టి ముడా అంత ఈజీ కాదన్న విషయం స్పష్టమవుతోంది. ముడా కొత్తలో 145 గ్రామాలతో ఏర్పాటుకాగా, ప్రస్తుతం ఈ పరిధిని విస్తరించి 204 గ్రామాలతో అథారిటీని ఏర్పాటు చేశారు. అందులో ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన మండలాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు నియోజవర్గాలు, నారాయణపేట, పరిగి నియోజవర్గాల గ్రామాలున్నాయి. రాష్ట్రంలోనే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో మహబూబ్‌నగర్ అర్బన్ అథారిటీ పెద్దది కావడం విశేషం.

10 ఎకరాలలోపు లేఅవుట్‌లకు ఇక్కడే

ఇదివరకు లేఫుట్‌లు చేసే రియల్టర్లు, వ్యాపారులు డీటీసీపీ అనుమతులకు హైదరాబాద్ డీటీసీపీ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకునే వాళ్లు. అర్బన్ అథారిటీ వచ్చిన తరువాత 10 ఎకరాల లోపు లేఅవుట్ చేస్తే వాటిని ముడా పరిధిలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ముడా కార్యాలయం కలెక్టర్ కార్యాలయానికి సిఫార్సు చేస్తే అధికారులు నిబంధనల మేరకు లే అవుట్‌లు ఉన్నాయా? లేదా అన్న విషయాలను పరిశీలించి అనుమతులు ఇస్తారు. ఇలా ఒక ఎకరాకు మార్కెట్ విలువను బట్టి రూ.6 లక్షల నుంచి రూ8 లక్షల వరకు ఫీజు ముడాకు చెల్లించాల్సి ఉంటుంది. 10 ఎకరాలు లేఅవుట్ చేస్తే ముడా ఖజానాకు రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. 10 ఎకరాలకన్నా ఎక్కువ లేఅవుట్ ఉంటే మాత్రం హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. మునిసిపాలిటీలలో కాకుండా గ్రామాలు, మండలాలలో 300 నుంచి 600 గజాలలోపు భవన నిర్మాణాలు చేపడితే ముడా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా కమర్షియల్ నిర్మాణాలు అంటే ఫౌల్ట్రీఫాంలు, సినిమా థియేటర్ల నిర్మాణాలకు కూడా ముడా ద్వారానే అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటి ఫీజులు ఖజానాలో జమ అవుతాయి. మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు అయిన నాలుగేళ్ల కాలంలో ముడా ఖజానాకు రూ.41 కోట్ల నిధులు జమఅయ్యాయి. వీటిలో గత పాలక మండలి రూ.12 కోట్లు ఖర్చుచేయగా, ప్రస్తుతం రూ.29 కోట్లు ఉన్నాయి.

నిధులు దుర్వినియోగం చేయకుండా పనులు



ముడా నిధులు దుర్వినియోగం చేయకుండా శాశ్వత పనులకే ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వాలని అనుకుంటున్నాం. ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాలలో గుర్తించిన పనులను త్వరలోనే చేపట్టేందుకు ప్లాన్ చేస్తున్నాం. నిధులు దుర్వినియోగం చేయకూడదని ముడా పరిధిలో ఏజెన్సీతో ఒప్పందం చేసుకుని 50 బస్టాప్‌లను ప్రజలకు ఉపయోగపడేలా నిర్మించబోతున్నాం. ఇందులో 70 శాతం నిధులు ఏజెన్సీ ద్వారా, 30 శాతం నిధులు ముడా నుంచి చెల్లిస్తాం. ఇలా ప్రజలకు ఉపయోగపడే మంచి పనులే చేయాలని నిర్ణయించాం. సీసీ రోడ్లు, మురుగు కాలువలు కాకుండా పాఠశాలలు, దేవాలయాలు, కమ్యూనిటీ భవనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అందరం ఆలోచన చేస్తున్నాం. అదేవిధంగా ఎకరా, రెండెకరాల స్థలంలో అన్ని హంగులతో ముడా కార్యాలయం నిర్మించే ప్రయత్నం చేస్తున్నాం.

\- లక్ష్మణ్‌యాదవ్, ముడా చైర్మన్

శాశ్వత పనులపై దృష్టి

ఇదివరకు ఖర్చు చేసిన రూ.12 కోట్ల నిధులలో హరితహారం కోసమే ఎక్కువ ఖర్చుచేశారన్న ఫిర్యాదులున్నాయి. అయితే ప్రస్తుత పాలక మండలి మాత్రం శాశ్వత పనుల కల్పనపైనే ఎక్కువగా దృష్టి సారిస్తోంది. వీటిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు కాకుండా పాఠశాలల్లో మూత్రశాలలు, ఆర్‌వో వాటర్ ప్లాంట్‌లు, కమ్యూనిటీ భవనాలు, ఆలయాల్లో షెడ్ల నిర్మాణం, పార్కులు, బ్యూటిఫికేషన్, బస్టాప్ వంటి నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నారు.

నామినేషన్ పద్ధతికి స్వస్తి

ముడా పరిధిలో నియోజకవర్గాల మండలాల్లో త్వరలోనే అభివృద్ధి పనులు చేపట్టేందుకు పనులను ఎంపిక చేసే పనిలో పడ్డారు. 5 నియోజవర్గాల్లో ఉన్న మండలాల గ్రామాలను బట్టి ఒక్కో మండలంలో రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సూచించిన పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అయితే ఈ పనులను నామినేషన్ పద్ధతిలో కాకుండా టెండర్ల ద్వారా పనులు నిర్ణయించనున్నారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు



కొల్లాపూర్ పట్టణంలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం

కొల్లాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యువత డ్రగ్స్, గంజాయికి బానిసలు కావొద్దని టాస్క్ ఫోర్స్ టీం అడిషనల్ ఎస్పీ భాస్కర్ తెలిపారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్ రెడ్డి నేతృత్వంలో ప్రతీ కిరాణం షాపు, పాన్ డబ్బాలను, బైక్‌లు, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అడిషనల్ ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ... యువత గంజాయి వాడుతూ పెడదోవ పడుతున్నారని సమాచారం మేరకు పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. మత్తు పదార్థాలు వాడడం వల్ల యువత జీవితాలు నాశనం అవుతాయని, గంజాయి వాడినా, అమ్మిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెద్దకొత్తపల్లి మండలంలో పెద్దకార్పాముల గ్రామంలో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ, సీఐ నాగిరెడ్డి పేర్కొన్నారు. మూడు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడుతున్న యువతను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి కొల్లాపూర్ నియోజకర్గంలో ప్రత్యేక బృందాలతో నిఘా ఉంటుందని తెలిపారు. సాయంత్రం గంజాయి, డ్రగ్స్‌ను గుర్తించేందుకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీస్ శాఖల ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌లతో కొల్లాపూర్ పట్టణాన్ని జల్లెడ పట్టారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఖిల్లాఘణపురంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రం నుంచి ఖిల్లాఘణపురం మండల కేంద్రం మీదుగా ఎమ్మెల్యే మేఘారెడ్డి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో రైతులు, విలేకరు లతో మాట్లాడారు. రైతుల ఆకాంక్షల మేరకు ఖిల్లాఘణపురం, పెద్దమందడి మండలాలకు ప్రత్యేకంగా వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 22న మండలంలోని షాపూర్ గ్రామ పరిధిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాప న చేయనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, క్యామ వెంకటయ్య, వెంకటేశ్వరరావు, సతీష్, శ్యాంసుందర్ రెడ్డి, గంజాయి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లపై నిర్లక్ష్యం తగదు : డీపీవో

అమరచింత, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ హాస్టళ్లపై క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలురు హాస్టల్‌ను డీపీవో సురేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేద మధ్య తరగతి పిల్లలు చదువుకునే సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్షేత్రస్థాయి అధికారులను ఆయన ఆదేశించారు. హాస్టల్‌లో నిర్వహణపై వార్డెన్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. విద్యార్థులకు ఏమాత్రం అసౌకర్యం, మెనూ విషయంలో నిర్లక్ష్యం జరిగిన చర్యలు తప్పవని ఆయన సూచించారు.

బర్డ్‌ఫ్లూ కలకలం?

● వైరస్‌తో 4 వేలకు పైగా బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత

వనపర్తి క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొట్ట మొదటి సారిగా బర్డ్‌ఫ్లూ వైరస్ కలకలం రేపుతోంది. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొన్నూరు గ్రామంలో కొన్నూరు గ్రామానికి చెందిన రైతు శివ కేశవరెడ్డికి 5వేల సామర్థ్యం గల పౌల్ట్రీఫామ్‌లో కోళ్లను పెంచుతున్నాడు. మూడు రోజుల్లోనే 4వేలకు పైగా కోళ్ల మృత్యువాత పడ్డాయి. ఈ విషయాన్ని కోడిపిల్లలను ఇచ్చిన ప్రీమియం కంపెనీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో మంగళవారం సాయంత్రం పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బుధవారం పశుసంవర్ధక శాఖ అధికారి పౌల్ట్రీఫామ్ వద్దకు చేరుకొని కోళ్లను పరిశీలించారు. చనిపోయిన కోళ్లను అక్కడే శివకేశవరెడ్డి వ్యవసాయ పొలంలో ఎక్స్‌కవేటర్ సాయంతో గోతితీసి పూడ్చి వేయించారు. ఉమ్మడి జిల్లాలో బర్డ్ ఫ్లూ ఎక్కడ వ్యాపించలేదని, కొక్కెర అనే వ్యాధితోనే కోళ్లు మృతి చెందినట్లు అనుమానంగా ఉందని వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని వారి ఆదేశాల మేరకు కోళ్ల శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. ల్యాబ్‌కు పంపిన పరీక్షల ఫలితాలు వచ్చిన తరువాతనే ఏ వ్యాధి అనేది నిర్ధారణ అయ్యే అవకాశం ఉందన్నారు.

ఉలిక్కిపడ్డ పౌల్ట్రీ యజమానులు

ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా మొదటి సారిగా 4 వేలకు పైగా కోళ్ల ఒకేసారి మృతి చెందడంతో పౌల్ట్రీరంగం యజమానులు ఉలిక్కి పడ్డారు. మొన్నటి వరకు ఆంధ్రాలో ఈ వైరస్‌తో కోళ్ల మృతి చెందాయని, జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచించారు. ఈ వైరస్ కోళ్లకు వ్యాప్తి చెందితే గంటల వ్యవధిలోనే లక్షల కోళ్ల మృత్యువాత పడతాయని పౌల్ట్రీ యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత పశు సంవర్ధక శాఖ అధికారులు, ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వైరస్ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




కొనప్రాణంతో ఉన్న కోళ్లను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి

మూతపడుతున్న కోళ్ల ఫారాలు

ఫారాల్లో కోళ్లను పెంచేందుకు కొన్ని కంపెనీలు పెట్టుబడులు పెడుతుండడంతో కొందరు రైతులు స్వయంగా, మరికొందరు లీజుకు తీసుకుని కోళ్లను పెంచుతున్నారు. 42 రోజుల్లోనే కోళ్ల అమ్మకానికి వస్తుండడంతో లాభాలపై ఆశలతో చాలా మంది పౌల్ట్రీ రంగం వైపు మొగ్గు చూపారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 24 లక్షల 30వేల కోళ్లు పెంచుతున్నారు. వైరస్ దెబ్బకు సగానికి పైగా కోళ్ల పెంపకాన్ని బంద్ చేశారు.

మూడు రోజుల్లోనే మృతి చెందాయి



మూడు రోజుల్లోనే 4వేల కోళ్లకు పైగా మృతి చెందాయి. మొదట్లో పదుల సంఖ్యలో కోళ్లు చనిపోయినప్పుడు కంపెనీ యజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. వెంటనే పశు సంవర్ధక శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాను. కోళ్ల మృతితో తీవ్రంగా నష్టపోయాను. పెట్టిన పెట్టుబడి వరకైనా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

\- శివ కేశవరెడ్డి, పౌల్ట్రీ యజమాని, కొన్నూరు

శ్యాంపిళ్లు ల్యాబ్‌కు పంపిస్తున్నాం



మూడు రోజుల్లోనే 4వేల కోళ్ల మృతి చెందాయి. శాంపిళ్లు ల్యాబ్స్‌కు పంపించాము. ఏ వైరస్‌తో మృతి చెందాయనేది పరీక్షల తర్వాత నిర్ధారిస్తాం. ప్రస్తుతం కొక్కెర వ్యాధితో మృతి చెందినట్లు అనుమానంగా ఉంది. పౌల్ట్రీ రంగం యజమానులు వైరస్ వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

\- వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

దళితుల ఆర్థికాభివృద్ధి కోసమే ఎస్సీ కార్పొరేషన్

గద్వాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వార దళితుల ఆర్థికాభివృద్ధి, జీవనోపాధులకు కృషి చేస్తున్నట్లు జనరల్ మేనేజర్ ఆనంద్‌బాబు తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా బుధవారం గద్వాలకు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. గత ప్రభుత్వం దళితులకు భూపంపిణీలో భాగంగా 251మందికి 684ఎకరాల భూమిని పంపిణీ చేసిందని తెలిపారు. ఆ తర్వాత కూడా పంపిణీ చేయడానికి అధికారులు కృషి చేసినప్పటికీ సాధ్యం కాలేదని వివరించారు. భూ పంపిణీకోసం మిగిలిన రూ.11కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నట్లు ఆయన వివరించారు. భూ పంపిణీలో భూములు పొందిన రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.38లక్షలు అందించామని వివరించారు. రూ.30లక్షలు ఖర్చుచేసి 19బోర్లు వేసి విద్యుత్ లైన్లు, మోటార్లను మిగించి ఇచ్చామని వివరించారు. ఆ తర్వాత మరో 99బోర్లకు రూ. 1.07కోట్లను మంజూరు చేశామని ఇందులో 45బోర్లను ఇప్పటికే డ్రిల్లింగ్ పూర్తి చేశామని వివరించారు. బ్యాంక్ లింకేజీ కింద 327మందికి గాను 321మందికి రూ.3.66కోట్ల రుణం అందించామని, ఇందులో 80శాతం సబ్సిడీ ఉందని వివరించారు. పెట్టి స్కీమ్ కింద 172మందికి వందశాతం సబ్సిడితో రూ.86లక్షలు అందించామని వివరించారు. ఇవే కాకుండా జీవనోపాధుల కింద 78 గేదెల యూనిట్లు మంజూరు అయ్యాయని, ఒక్కో యూనిట్ రూ.2లక్షలు ఉందని వివరించారు. పశుసంవర్ధక శాఖ నుంచి అనుమతి రాగానే గ్రౌడింగ్ పూర్తి చేసి అందిస్తామని వివరించారు. దళితబంధు పథకం కింద 200 యూనిట్లు మంజూరు కాగా ఒక్కటి మినహా మొత్తం సాఫీగా పంపిణీ జరిగిందని దీని ద్వారా చాలా మంది ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడిందని వివరించారు. సాధారణ తనిఖీలలో భాగంగా గద్వాల జిల్లాకు వచ్చానని, పథకాలు సాఫీగా లబ్ధిదారులకు అందుతున్నాయని వివరించారు. ఈడీ రమేష్ బాబు అధికారులు ఉన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం ఆనంద్‌బాబు

సాగునీరివ్వడంలో విఫలం

\- ఆర్డీఎస్ కింద పంటలు ఎండుతున్నాయి

\- కాలువను పరిశీలించిన బీజేపీ నాయకుల బృందం



సింధనూరు వద్ద డీ-12లో నీటిపారుదల లేదని చూపిస్తున్న బీజేపీ నాయకులు

గద్వాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కింద పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సాగునీరు ఇవ్వడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం పార్టీ నాయకుల బృందంతో కలిసి ఆయన ఆర్డీఎస్ కాలువను డి-12 సిందనూరు వద్ద పరిశీలించారు. డి-12నుంచి పదిరోజులుగా సాగునీరు రావడం లేదని తెలిపారు. మరో మూడురోజులు నీరు పంటలకు అందకపోతే ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. ఆర్డీఎస్ కాలువ కింద వరి, మొక్కజొన్న, మిరప పంటలు వేశారని పంటలు ఆశాజనకంగా ఉన్న సమయంలోనే నీరు అందకపోవడం రైతులను ఆందోళనలో పడేసిందని తెలిపారు. పైనున్న కర్ణాటక, కిందున్న ఆంధ్రప్రదేశ్ రైతులకు సాగునీరు అందుతున్నా... మధ్యలో ఉన్న రాష్ట్ర రైతులు ఆగమైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులలో కర్ణాటక నుంచి సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆర్డీఎస్ సమస్య పరిష్కారం కావాలంటే చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేసి ఆర్డీఎస్ కాలువకు లింక్ చేయాలని డిమాండ్ చేశారు. తుమ్మిళ్ల ప్రాజెక్టు పరిధిలోని మల్లమ్మకుంట రిజర్వాయర్‌ను పూర్తి చేయాలన్నారు. రాజగోపాల్, గోపాలకృష్ణ, భరత్‌రెడ్డి, నర్సింహులు, లక్ష్మన్‌గౌడ్, అశోక్, గోపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరం నుంచి శ్రీశైలానికి

మోకాళ్లపై భక్తుడి యాత్ర



మోకాళ్లపై వెళ్తున్న బాలనాగయ్య

దోమలపెంట ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : తన కోరికలు తీర్చినందుకు మల్లికార్జున స్వామిపై భక్తితో ఓ వ్యక్తి మండుటెండను సైతం లెక్క చేయకుండా మోకాళ్లపై యాత్ర చేపట్టాడు. ఐదు రోజుల క్రితం శ్రీశైలానికి ఉత్తరముఖ ద్వారమైన ఉమామహేశ్వరం నుంచి మోకాళ్లపై శ్రీశైలానికి వస్తానని భక్తుడు తిమ్మాజిపేట మండలం మారేపల్లి గ్రామానికి చెందిన బాలనాగయ్య మోకాళ్లపై యాత్ర చేస్తున్నాడు. బుధవారం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామానికి చేరుకోగా ఆయనకు శివస్వాములు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం కడుపేదరికంలో ఉండి శ్రీశైలం భ్రమరాంబికామల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు పాదయాత్రగా వచ్చి తను కోరుకున్న కోరికలు తీరి అన్నివిధాలుగా ఆర్థికంగా బలపడ్డానని, తన కోరికలు నెరవేరినందుకు మోకాళ్లపై యాత్ర చేస్తానని గతేడాది స్వామివారిని కోరుకొని ఈ యాత్ర చేపట్టానని ఆయన తెలిపారు. ఈ యాత్ర కుమారులు, బంధువులు సహకరిస్తున్నారని తెలిపారు.

మునిసిపల్ మాజీ చైర్మన్

ముత్యాల ప్రకాశ్ మృతి

- కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూత
- డీసీసీ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం బాధ్యతలు



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన సీనియర్ నాయకుడు, ఉమ్మడి పాలమూరు ప్రజలకు సుపరిచితులు ముత్యాలప్రకాశ్(77) బుధవారం కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పరమపదించారు. గురువారం పాలమూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాంగ్రెస్‌లోనే రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన 1969 తెలంగాణ ఉద్యమంలో పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం అదే పార్టీలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లో చేరాలని ప్రయత్నించినా కుదరలేదు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన 1981లో కౌన్సిలర్‌గా పనిచేశారు. రీజినల్ ఫిలింబోర్డు మెంబర్‌గా, జడ్‌ఆర్‌యూసీసీ సభ్యులుగా పనిచేశారు. 1999-2004 వరకు మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్‌గా, 2005నుంచి 2012 వరకు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2012లో అప్పటి ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మరణంతో వచ్చిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. దసరా ఉత్సవ కమిటీలో చురుగ్గా పనిచేసేవారు. ఆయన మృతిపై తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ మీడియా సెల్ ఇన్‌చార్జి సీజె బెనహర్ సంతాపం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

పోగొట్టుకున్న బంగారాన్ని తిరిగి

అప్పగించిన పోలీసులు



బంగారు గాజు అప్పగిస్తున్న పోలీసులు

వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఉద్యోగి తను పోగొట్టుకున్న 15 గ్రాముల బంగారు గాజును తిరిగి పోలీసులు ఛేదించి ఇచ్చిన ఘటన వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన జూనియర్ లెక్చరర్ విజయలక్ష్మి వనపర్తి బస్టాండ్‌లో నాగర్‌కర్నూల్ వెళ్లడం కోసం బుధవారం ఉదయం 10 గంటలకు బస్సు ఎక్కింది. ఎక్కిన వెంటనే బస్సులో తన చేతికి ఉన్న 15 గ్రాముల బంగారు గాజు లేకపోవడంతో బస్ దిగి వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కానిస్టే బుళ్ల కిషోర్, శ్రీను, అభిషేక్, రాజమోహన్‌లు బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సీసీ ఫుటేజీలలో బంగారు గాజు ఓ మహిళకు దొరకడంతో ఆమె తీసుకుని ఎక్కిన బస్సు వెళ్లిన రూట్‌లో విచారణ చేసి బంగారు గాజు స్వాధీనం చేసుకుని బాధిత మహిళకు అప్పగించినట్లు తెలిపారు. ఈసందర్భంగా మహిళ పోగొట్టుకున్న బంగారాన్ని అప్పగించిన పోలీస్ కానిస్టేబుళ్లను ఎస్‌ఐ అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

వీపనగండ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బొల్లారం గ్రామానికి చెందిన నీరజ రాచాల శ్రీనివాస్‌గౌడ్ దంపతులు రెండు సంవత్సరాలుగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జీవనం సాగిస్తున్నారు. శ్రీనివాస్‌గౌడ్ (50) బంధువు చనిపోవడంతో స్వగ్రామమైన బొల్లారానికి వచ్చారు. బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని తన వ్యవసాయ పొలం దగ్గరికి వెళ్లాడు. కుటుంబ కలహాలతో శ్రీనివాస్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ రాణి తెలిపారు. భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బస్టాండ్ ప్రాంగణంలో అనాథ వృద్ధుడి మృతి

బిజినేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో నిద్రిస్తున్న గోవిందు (65) అనే అనాథ వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన వృద్ధుడు బస్టాండ్‌లో నిద్రిస్తున్న స్థలం నుంచి మధ్యాహ్న సమయం కావస్తున్నా ఎంతకీ లేవకపోవడంతో అనుమానం వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండవ ఎస్‌ఐ రాజశేఖర్ ఘటన స్థలానికి వచ్చి వృద్ధుడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించాడు. మృతుడికి ఎవ్వరు లేకపోవడంతో శవాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడికి సరైన ఆహారం లేక అనారోగ్యం పాలై మృతి చెంది ఉంటాడని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

వివాహిత, ముగ్గురు పిల్లలు అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వివాహిత ఇర్ఫానాబేగం తన ముగ్గురు పిల్లలను తీసుకుని కన్పించకుండా పోవడంతో ఆమె తండ్రి అబ్దుల్ రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన చోటేమియా అధిక వడ్డీ ఆశ చూపి లక్షల రూపాయలు కొల్లగొట్టిన సంఘటనలో జైలుకెళ్లాడు. అప్పటి నుంచి ఆయన భార్య ఇర్ఫానాబేగం తన తల్లిదండ్రులు వద్ద జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటుంది. ఇటీవల చోటేమియా జైలు నుంచి విడుదలయ్యారు. అంతలోనే అతని ముగ్గురు పిల్లలను తీసుకుని ఫిబ్రవరి 17న ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టుపక్కల బంధువుల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఇర్ఫాన్ తండ్రి అబ్దుల్ రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పాత్లావత్ సంధ్య(22) అనే వివాహిత మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన తిమ్మాజిపేట మండలం గొరిట తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, మృతురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. భూత్పూరు మండలం భట్టుపల్లితండాకు చెందిన సంధ్యను గొరిట తండాలోని పాత్లావత్ జగన్‌కు 2023 మే నెలలో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్న కానుకలు ఇచ్చేశారు. అయితే అదనపు కట్నం కోసం భార్య సంధ్యను తరచూ భర్త జగన్ వేధిస్తున్నాడు. మంగళవారం రాత్రి కూతురు చనిపోయిందని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినట్లు తండావాసులు తల్లికి సమాచారం ఇచ్చారు. బుధవారం వెళ్లి చూడగా సంధ్య మృతి చెందినట్లు గుర్తించారు. అదనపు కట్నం కోసమే తన కూతురుని హత్య చేశారని తల్లి అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త జగన్, 11 నెలల కూతురు ఉన్నారు.

అవినీతి తిమింగలాలు



- పోలీస్, రెవెన్యూ శాఖల్లో పెరిగిన లంచావతారులు
- నిన్న మక్తల్ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, నాడు దామరగిద్ద తహసీల్దార్ ఏసీబీకి ట్రాప్

నారాయణపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పోలీస్, రెవెన్యూ శాఖల్లో అవినీతి అధికారులు పెరగడంతో పలువురు ఏసీబీ అధికారులకు పట్టు బడుతున్నారు. పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా పలువురు రైతులు తిరుగుతున్నా ముడుపులు లేనిదే పనులు కావడం లేదనే బలమైన ఆరోపణలు విని పిస్తున్నాయి. ముడుపులు ఇచ్చినా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందేనని రైతులు వాపోతున్నారు. ఈ మధ్య కాలంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు పలువురు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతున్నది.

ఈ నెల 18న మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఇద్దరు కానిస్టేబుళ్ల నర్సిములు, శివ రూ. 40 వేలు డిమాండ్ చేయగా అడ్వాన్సుగా రూ. 20 వేలు సీఐ కార్యాలయంలో కానిస్టేబుల్ నర్సిములుకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఎస్.వెంకట్రావుపై మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు సెక్షన్లు ఐపీసీ 506, 376 కింద కేసులు ఉన్నాయి. ఆయనకు ప్రస్తుతం హైకోర్టు మంజూరు చేసిన కండీషన్ బెయిల్‌పై ఉండగా సాధారణ బెయిల్ కోసం మక్తల్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి.. తనకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలని పోలీసులను కోరారు. ఇందుకు పోలీసులు రూ. 40 వేలు డిమాండ్ చేశారని ఎస్.వెంకట్రావు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారు మక్తల్ సీఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లను పట్టుకుని కేసులు నమోదు చేశారు.

ఇదివరకే మరికల్ తహసీల్దార్ పట్టుబడ్డ కొన్ని రోజులకే అదే కార్యాలయంలో ఇరువురు సిబ్బంది కూడా అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. దామరగిద్ద తహసీల్దార్ వెంకటేష్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టు బడడం జిల్లాలోని రెవెన్యూ శాఖలో అప్పట్లో కలకలం రేకెత్తించింది.

జిల్లాలో ఏసీబీ దాడుల్లో చిక్కుకున్న సంఘటనల విషయానికి వస్తే తాజాగా మక్తల్‌లో సీఐ చంద్రశేఖర్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్ల నర్సిములు, శివ ఏసీబీకి చిక్కారు. ఇదివరకే గతంలో దామరగిద్ద మండలం అన్నాసాగర్‌లోని రైతు బింగి వెంకటప్ప తల్లి అమృతమ్మ పేరిట సర్వే నంబర్ 144లో 30 గుంటల భూమిలో 15 గుంటలను ఫౌల్ట్రీ ఫారం కోసం వ్యవసాయేతర భూమిగా మార్చాలనే వ్యవహారంలో దామరగిద్ద తహసీల్దార్ వెంకటేష్ 5వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఏప్రిల్ 7న మరికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ జగన్, సీనియర్ అసిస్టెంట్ తాహేర్‌లు రాకొండ గ్రామానికి చెందిన ఓ రైతుకు సంబంధించి ఆన్‌లైన్‌లో భూ మార్పిడి కోసం రూ.3.50 లక్షలు లంచం డిమాండ్ చేయడంతో ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారు. అలాగే జనవరి 19న మరికల్ తహసీల్దార్ శ్రీధర్ విరాసత్ కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. సంగంబండ రైతు వెంకటొరెడ్డి భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో మక్తల్ సబ్ రిజిస్ట్రార్ హాబీబొద్దీన్ రూ.75 వేలు లంచం తీసుకుంటూ 2019, నవంబరు 21న ఏసీబీకి చిక్కాడు. దామరగిద్ద జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బాలకిష్టయ్య మార్చి 5, 2019న రాత్రి మహబూబ్ నగర్‌లో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. 2018లో నర్వ ఎంపీడీవో రాఘవ సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్ బాల్‌రెడ్డికి సంబంధించి నిలిచిన 8 నెలల జీతం బిల్లుల చెల్లింపు కోసం పదివేలు లంచం అడిగాడని ఆరోపిస్తూ ఎంపీడీవోను ఏసీబీకి పట్టించారు. ఊట్కూర్ ఆర్‌ఐ సతీష్ కుమార్ రెడ్డి 2018, అక్టోబరు 12న పెద్దజట్రం గ్రామానికి చెందిన రైతు కొండారెడ్డి సర్వేనంబర్ 252లో 13ఎకరాల భూమిలో తన కూతురు శ్రీదేవి పేరిట 6.02 ఎకరాల భూమిని వరకట్నం కింద ఇవ్వడంతో విరాసత్‌గా మార్చేందుకు పదివేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మక్తల్ మండలం గుడిగండ్ల వీఆర్వో విష్ణు విరాసత్ కోసం పదివేలు లంచం తీసుకున్నారంటూ ఏసీబీకి పట్టించారు. ఇలా పలువురు ఏసీబీ వలలో అవినీతి అధికారులు చిక్కు కుంటున్నారు. అవినీతిని ప్రోత్సహించ కూడదని ఎవరు లంచం అడిగినా ఏసీబీని ఆశ్రయించాలని, టోల్ ఫ్రీ 1064కు డయల్ చేయాలని అధికారులు కోరుతున్నారు.

విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తే చర్యలు తప్పవు

- ఆర్జేడీ విజయలక్ష్మి



విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడీ

రాజాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను మానసికంగా వేధిస్తూ.. ఒత్తిడికి గురి చేస్తే ఎస్‌వోలపై, సీఆర్టీలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆర్జేడీ విజయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'కేజీబీవీల్లో ఆధిపత్య పోరు' అనే అంశంపై వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు, మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ విజయలక్ష్మి పాఠశాల ఎస్‌వోకు, సీఆర్టీలకు ప్రత్యేకంగా, విద్యార్థులతో ప్రత్యేకంగా వివరాలు సేకరించారు. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిని తమ సొంత పిల్లల కన్నా మంచిగా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులు కొందరు ఉపాధ్యాయలపై ఆర్జేడీకి ఫిర్యాదులు చేశారు. అదే సమయంలో పాఠశాలలో విద్యార్థులతో వివరాలు సేకరిస్తుంటే, మరికొందరు ఉపాధ్యాయులు తమ గురించి విచారణకు వచ్చిన అధికారులకు చెడుగా చెప్పవద్దని, మంచిగా చెప్పాలని వేధించడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన చోటు చేసుకుంది. కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న గొడవలపై పూర్తి విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. విద్యాధికారి సుధాకర్, ప్రత్యేక అధికారి ఇందిర పాల్గొన్నారు.

సహాయం చేస్తామని నమ్మించి మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

మిడ్జిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తనకు సహాయం కావాలని ఇన్‌స్ట్రాగ్రాంలో పెట్టిన మెసేజ్‌ను ఆసరాగా చేసుకొని రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడిని ఆన్‌లైన్‌లో మోసం చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలోని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిడ్జిల్‌కి చెందిన బరిగెల ఆంజనేయులు గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పలు ఆస్పత్రులలో చికిత్స చేయించుకొని ఇంటివద్ద ఉంటూ మందులను వాడుతున్నారు. తను ఆస్పత్రికి చూపించుకునేందుకు, మందులను కొనుగోలు చేసేందుకు ఇబ్బందిగా ఉందని హర్షసాయి ఇన్‌స్ట్రాగ్రాంలో ఐడీలో సహాయం కావాలని కామెంట్ చేసినట్లు తెలిపారు. వెంటనే హర్షసాయి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని రూ. 4 లక్షలు సహాయం చేస్తామని ఆంజనేయులును ఇన్‌స్ట్రాగ్రాంలో చాటింగ్ చేసి నమ్మించారు. తమ కార్యాలయంలోని డాక్యుమెంట్, కార్యాలయం బ్యాక్ ఎండ్ చార్జెస్ ఉంటాయని, తాము చెప్పిన నెంబర్‌కు ఫోన్‌పే చేస్తే వెంటనే మీకు ఇచ్చే రూ. 4లక్షలను మీకు సెండ్ చేస్తామని నమ్మించారు. వెంటనే ఆంజనేయులు వారిచ్చిన నెంబర్‌కు రూ. 22వేల రూపాయలను ఫోన్‌పే ద్వారా సెండ్ చేశారు. తాను మీరు చెప్పిన డబ్బులను పంపానని.. తనకు ఇస్తానన్న రూ. 4లక్షలు ఇవ్వాలని ఆంజనేయులు వారికి ఫోన్‌చేసి అడిగాడు. రూ. 5500 అదే ఫోన్‌పేకు సెండ్‌చేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారని బాధితుడు తెలిపారు.

తర్వాత ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ ఉండటంతో తాను మోసపోయాయని గ్రహించిన ఆంజనేయులు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉదండాపూర్‌లో సర్వే చేయిస్తాం.. బోగస్ ఏరివేస్తాం!

- జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి



జడ్చర్లలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న ఉదండాపూర్‌లో సర్వే చేయిస్తామని, జాబితాలో ఉన్న బోగస్‌ను ఏరివేస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. జడ్చర్లలో బుధవారం శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజమైన నిర్వాసితులకే న్యాయం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రూ.42కోట్లు నిర్వాసితుల ఖాతాలలో జమ అయ్యాయన్నారు. తాజాగా మరో రూ.71కోట్లు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. వల్లూరులో నివాసం ఉంటున్నట్లుగా గతంలో 1005 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయని, వాస్తవానికి 570 మంది మాత్రమే నివాసం ఉంటున్నారని, మిగిలిన వారంతా బీఆర్‌ఎస్ నాయకులు చేర్చిన బోగస్ లబ్ధిదారులని ఆరోపించారు. ప్రస్తుతం వల్లూరు, ఇతర తండాలలో సర్వే పనులు పూర్తి అయ్యాయని, కేవలం ఉదండాపూర్‌లో మాత్రమే సర్వే జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. సర్వే చేస్తే ఇవరికి ఇళ్లు రావాలో, ఎవరికి స్ట్రక్చర్ విలువ రావాలో వారికే వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ముంపునకు గురవుతున్న తండాలకు చెందిన నిర్వాసితుల ఖాతాలలో రూ.42 కోట్లు జమ అయ్యాయన్నారు.

రెండు రోజుల క్రితమే మరో రూ.71కోట్లు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు అవార్డు పాసైతే ఆరు నెలల లోపుగా వారికి వచ్చే నిధులన్ని తీసుకువస్తానని హామీ ఇచ్చారు.

నిర్వాసితులకు పరిహారం పెంపు అంశం ప్రస్తుతం పరిశీలనలో ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. అధికార పక్షానికి చెందిన ఎమ్మెల్యేనే అయినా నిర్వాసితుల పక్షానే ఉంటానని ఈ సందర్భంగా అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు.

కారు, బైకు ఢీ.. ఇద్దరి మృతి

- మృతులు తెలకపల్లి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శ్రీను, శేఖర్
- ప్రమాదానికి గురైన కారు తెలకపల్లి మండలం కార్వంగకు చెందినట్లుగా గుర్తింపు

తాడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గుంతకోడూరు గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... తెలకపల్లి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శ్రీను(42), ఇదే గ్రామానికి చెందిన శేఖర్(30), తెలకపల్లి మండలం కార్వంగ గ్రామానికి చెందిన రవికుమార్ కారులో కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్నారు. అనంతసాగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న శ్రీను, శేఖర్ మోటారు సైకిల్ ఢీకొనింది. దీంతో మోటారు సైకిల్‌పై ఉన్న వీరిద్దరు కింద పడిపోవడంతో వారిపై నుంచి కారు దూసుకెళ్లి పక్కనే ఉన్న రైతుకు సంబంధించిన మొక్కజొన్న పంటలోకి దూసుకెళ్లింది. గమనించిన చుట్టుపక్కల రైతులు ఘటనకు సంబంధించి పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వారిద్దరినీ అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే శ్రీను మృతి చెందగా, శేఖర్‌ను నాగర్‌కర్నూల్ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు సమాచారం. అయితే శ్రీను అనే వ్యక్తి హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ పంపులో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ మంగళవారం సొంత ఊరైన అనంతసాగర్‌కు వచ్చాడు. పని పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్తుండగా నేను వస్తానంటూ శేఖర్ శ్రీను వెంబడి బయల్దేరి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

ఘటనకు సంబంధించి శ్రీను భార్య మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. మృతి చెందిన శ్రీనుకు భార్య మాధవితో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా, శేఖర్‌కు సైతం భార్య హేమతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.



మొక్కజొన్న పంటలోకి దూసుకెళ్లిన కారు



శేఖర్ (ఫైల్)



శ్రీను (ఫైల్)

కబడ్డీ టోర్నీలో విజేతగా నిలవాలి

- జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్
- తరలిన జిల్లా కబడ్డీ జట్ల క్రీడాకారులు



కబడ్డీ క్రీడాకారులతో జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో నేటి నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. బుధవారం స్టేడియంలో మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువలేదని, ఎంతో మంది క్రీడాకారులు కబడ్డీలో జాతీయస్థాయిలో ప్రతిభ చాటారన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను అండగా ఉంటామని, టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి టోర్నీకి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వైస్ ప్రెసిడెంట్ దామోదర్‌రెడ్డి, పాపరాయుడు, గణేష్ పాల్గొన్నారు.

జిల్లా జట్టు వివరాలు:

బాలుర జట్టు: సురేష్, రాజేందర్, నాగరాజు, దేవ్‌సింగ్, క్రిష్ణ, హర్షవర్ధన్, కిశోర్, మణికంఠ, జశ్వంత్, నరేష్‌గౌడ్

బాలికల జట్టు: సోనూ, అన్నపూర్ణ, అక్షిత, కావేరి, నిహారిక, రక్షిత, సంధ్య, అరుంధతి, చిత్ర, అల్కనంద, హరితనాయుడు

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో

గోల్డ్‌మెడల్ సాధించిన పౌర్ణమి



గోల్డ్‌మెడల్‌ను అందుకుంటున్న పౌర్ణమి

మిడ్జిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె పౌర్ణమి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈనెల 18, 19వ తేదీలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-18 డిస్కస్ త్రో ఈవెంట్స్ మొదటి స్థానంలో నిలిచి పౌర్ణమి గోల్డ్‌మెడల్‌ను సాధించారు. బుధవారం పౌర్ణమికి గోల్డ్‌మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని అక్కడి నిర్వాహకులు, పోలీసు అధికారుల చేతులమీదుగా అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పౌర్ణమి జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ.. స్టేడియం గ్రౌండ్‌లో కోచ్ సునీల్‌తో శిక్షణ తీసుకుంటున్నట్లు పౌర్ణమి తెలిపారు. మల్లాపూర్ గ్రామానికి చెందిన పౌర్ణమికి రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి, గోల్డ్‌మెడల్ రావడంతో పలువురు గ్రామస్థులు, మండల నాయకులు ఫోన్‌లో అభినందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

లింగాలలో కమ్యూనిటీ కాంటాక్ట్

- 40 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- అడిషనల్ ఎస్పీ రామేశ్వరరావు

లింగాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : లింగాల మండల కేంద్రంలో కార్డెన్‌సెర్చ్ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పీ రామేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 5గంటలకు 70 మంది పోలీస్ బందోబస్తు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. వాహనాలు ఉన్న యజమానులతో వాహనానికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఇందులో 20వాహనాలకు నెంబరు ప్లేట్లు లేకపోవడంతో వాటిపై చర్యలు తీసుకో వాలని స్థానిక ఎస్‌ఐ నాగరాజుకు ఆదేశించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రామేశ్వర్‌రావు మాట్లాడుతూ లింగాల మండల కేంద్రంలో చాలా మంది తక్కువ ధరలకు వాహనాలు వస్తున్నాయని తీసుకుని వాటికి ఎలాంటి కాగితాలు కూడా ఉండటం లేదని, అలాంటి వాహనాలు రోడ్డుపైకి వచ్చి నడిపితే ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి ఇన్సూరెన్స్ రాకపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడే అవకాశం ఉందని తెలిపారు. ఎక్కువగా వాహనాలు నడిపే సమ యంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వాహనం కాగితాలు, ఆర్సీ ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సు కచ్చితంగా ఉండాలని సూచించారు. లింగాల ప్రాంతంలో చాలా మంది గంజాయికి అలవాటు పడి రహదారుల పక్కన గుంపులు గుంపులుగా ఉన్నట్లయితే వెంటనే 100కు సమాచారం అందజేయాలని సూచించారు. అదేవిధంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం ప్రతి వాహనదారుడు 18 సంవత్సరాలు నుంచి ఉండాలని డ్రైవింగ్ చేసే క్రమంలో సీటు బెల్టు, లైసెన్సు ఇన్సూరెన్స్ ఆర్సీ కచ్చితంగా ఉండాలని సూచించారు.

అదేవిధంగా సైబర్ క్రైమ్ వల్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్‌ఐలు నాగరాజుయాదవ్, బల్మూరు రమాదేవి, అచ్చంపేట ఎస్‌ఐ రమేష్, ఇందిరమ్మ, ఈగలపెంట ఎస్‌ఐ వీరమల్లు, శివకుమార్, సైదులు, సదాహుస్సేన్‌పాటు 70 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగంపై ఎన్నికల కేసు కొట్టివేత..

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారంటూ 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసును కొట్టేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అనుమతి లేకుండా సిరిపురంలో దాదాపు 300 మందితో ర్యాలీ నిర్వహించారన్న ఎన్నికల అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. నాగర్‌కర్నూల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఉన్న ఆ కేసును కొట్టేయాలంటూ నాగం పిటిషన్ వేశారు. విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. కేసును కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

న్యూస్ బాక్స్

కోదండాపురం ఎస్‌ఐగా మురళి

ఎర్రవల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోదండాపురం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా మురళి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఎస్పీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ విధులు నిర్వహించిన స్వాతి బదిలీలో భాగంగా నారాయణపేట వీఆర్‌కు వెళ్లగా, అదే స్థానంలో ఉన్న మురళి బదిలీపై వచ్చారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల వితరణ

అయిజ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిందనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను శివాజీ జయంతిని సందర్భంగా విలేజ్‌యూత్ టీం అందజేశారు. పరీక్షలకు అవసరమైన వస్తువులను ఇచ్చారు. కార్యక్రమంలో సురేష్, భద్రయ్య, సీతారాముడు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మానవపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. గురువారం కర్నూల్ జిల్లా గార్లపాడు శివారులో తుంగభద్ర నది నుంచి మండలంలోని జల్లాపురం శివారులో ఇసుకతో వస్తున్న టిప్పర్‌ను పోలీసులు తనిఖీ చేశారు. అనుమతులు లేకపోవడంతో కానిస్టేబుల్ వెంకటరమణ ఫిర్యాదుతో డ్రైవర్ అనిల్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి సంతోషకరం



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో , సీడీపీవో

గట్టు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్ వారి ఆర్థిక సాయంతో అంగన్‌వాడీలలో సౌకర్యాల కల్పనకు చేపట్టిన పనులను బుధవారం ఎంపీడీవో చెన్నయ్య, సీడీపీవో నాగరాణి ప్రారంభించారు. గొర్లఖాన్‌దొడ్డిలో 2, 3 కేంద్రాల భవనాలను భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మూత్రశాలల నిర్మాణం, వాటర్ ట్యాంకు సదుపాయం, బాలపెయింటింగ్ వంటి సౌకర్యాలను పూర్తి చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతు చేసి పిల్లలకు సౌకర్యాలు కల్పించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. సీడీపీవో మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని కేంద్రాలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంధ్య, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, డీపీఎం ఆనందకుమార్, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, నాగరాజు, అరుణ, గౌరమ్మ పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

గద్వాల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఈ నెల గురువారం రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకిషన్‌రావు, చక్రధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మెడివిజన్ ఐ ఆసుపత్రికి చెందిన డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుల రక్తదానం

రాజోలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడిన వారు అవుతారని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ఆడివేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం శివాజీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 49 మంది పాల్గొని రక్తదానం చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, గంగిరెడ్డి, దస్తగిరి, ఎంఈవో భగీరథరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

రాజోలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ జిల్లా ఎదురూరు చెందిన చాకలి దుబ్బన్న శాంతినగర్‌కు వెళ్లి తిరిగి రాజోలి మీదుగా ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. భారత్‌మాల రహదారి పనులకు కోసం వచ్చిన కాంక్రీట్ మిక్సర్ లారీ ముండ్లదిన్నె వైపు నుంచి తూర్పు గార్లపాడు గ్రామం శివారులోని క్యాంపునకు వెళ్తుండగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. చాకలి దుబ్బన్న కుడికాలు నుజ్జునుజ్జు అయ్యింది. చికిత్స కోసం కర్నూలు తరలించారు.

శ్రీశైలానికి భక్తుల పాదయాత్ర

వడ్డేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని పైపాడులో శివభక్తులు బుధవారం శ్రీశైలానికి పాదయాత్రగా తరలివెళ్లారు. అంతకుముందు శివాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, ఇరుముడి కట్టుకుని యాత్రకు బయలుదేరారు.

మానవపాడు: మండలంలోని పల్లెపాడులో శివమాలధారులు శివాలయంలో పూజలు చేశారు. ఇరుముడులు కట్టుకుని శ్రీశైలం వెళ్లారు.

పట్టణాభివృద్ధికి బాధ్యతతో పని చేయాలి

» కలెక్టర్ బీఎం సంతోష్

» మునిసిపల్ అధికారులతో సమీక్ష



మునిసిపల్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ అభివృద్ధికి సంబంధించి అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. పట్టణ మునిసిపాలిటీ కౌన్సిల్ గడువు ముగిసి ప్రత్యేక అధికారి పాలనలోకి వచ్చిన అనంతరం తొలిసారి బుధవారం కలెక్టర్ మునిసిపల్ కార్యాలయంలో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. విభాగాల వారీగా ప్రతీ అంశంపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, 37 వార్డుల పరిధిలో రెవెన్యూ, పారిశుధ్యం, మెప్మా, అకౌంట్స్, ఇంజనీరింగ్ విభాగాలపై పూర్తి సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా లభించే ఆస్తి, భూమి, దుకాణాల వసూళ్లను ఎప్పటికప్పుడు పూర్తిచేసి ప్రతి బిల్ కలెక్టర్ వారం వారీగా వసూళ్ల నివేదికను అందజేయాలన్నారు. పారిశుధ్యం విషయంలోనూ మరింత అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట అదనపు కార్మికులను నియమించుకోవాలని ఆదేశించారు. రెండు రోజుల్లోగా వార్డుల వారీగా అధికారులను కేటాయించి అన్ని రకాల పనులు వారి పర్యవేక్షణలోనే సాగేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. 15 రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహిస్తామన్న కలెక్టర్, ఆలోగా చేపట్టిన పనుల పురోగతిపై వార్డుల సమగ్ర నివేదిక ఉండాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మునిసిపల్ కమిషనర్ దశరథ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషా ప్రతిభ పోటీలు



ఉత్తనూర్ పాఠశాలలో ప్రతిభా పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం తెలంగాణ తెలుగు ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు పద్య పఠనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 21న నిర్వహించే జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, భానుప్రకాష్ తెలిపారు. పాఠశాల జీహెచ్ఎం ఇమ్మానియేల్, సంఘం కోశాధికారి జయన్న, అహ్మద్ హుస్సేన్, తాయన్న, రహమత్, మోహన్‌రావు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని ఉత్తనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం తెలుగు భాషా ప్రతిభా పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ తెలుగు టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 48 మంది పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు, 8వ తరగతి విద్యార్థులకు పద్య పఠనం పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఉత్తనూర్ పవిత్ర, భూమ్‌పూర్ సురేందర్, పద్య పఠనంకు మేడికొండ సలోమి, శైలజ ఎంపికయ్యారు. హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్. వెంకటస్వామి, మాబి, సత్యం, కరీంసాబ్, జహీర్ పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పద్య పఠన, క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో ప్రథమ విజేతగా పి.శివకుమార్ (జడ్పీహెచ్ఎస్, ధరూర్), ద్వితీయ విజేతగా అంకిత (జడ్పీహెచ్ఎస్, రేవులపల్లి) నిలిచారు. అలాగే పద్యపఠనంలో ప్రథమ విజేతగా అక్షయ (ఎంపీహెచ్ఎస్, అల్వాల్‌పాడు), ద్వితీయ విజేతగా అనూష (జడ్పీహెచ్ఎస్, ఉప్పేరు) నిలిచారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

'మునిసిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి'

గద్వాల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆధారంగా మునిసిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు రవి కోరారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కేటగిరీల వారీగా వేతనాలు పెంచుతూ జీవో జారీ చేసినా గద్వాల మునిసిపాలిటీలో మాత్రం అమలు చేయడం లేదన్నారు. పెరిగిన పట్టణ అవసరాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగకతో పనిభారంతో సతమతమవుతున్నట్లు తెలిపారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో శివ, మహేష్, రాజు, రఘు, హనుమంతు, లలితమ్మ, శివకుమార్, నరసింహ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గద్వాల విద్యార్థికి ప్రధాని అభినందన



అభినందన పత్రం అందజేస్తున్న హెచ్ఎం

గద్వాల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా చేపట్టిన ప్రేరణ కార్యక్రమానికి ఎంపికై సదస్సుకు హాజరైన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఆదికేశవకు ప్రధాని నరేంద్ర మోదీ నుంచి అభినందన పత్రం అందింది. దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, దేశం కోసం ఏమి చేయాలనే లక్ష్యాలను నిర్దేశించేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రేరణ కార్యక్రమానికి జిల్లా నుంచి విద్యార్థులు ఎంపికయ్యారు. వారు గతేడాది నవంబరు 24 నుంచి 30వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రం వాగ్రాఘర్‌లోని పాఠశాలలో వివిధ అంశాలపై శిక్షణ పొందారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థికి ప్రధాన మంత్రి నుంచి అభినందన లేఖ రాగా, బుధవారం పాఠశాల హెడ్‌మాస్టర్ ఇమ్మానుయేల్ విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు రేణుకాదేవి, అయ్యన్న, హైమావతి, తాయన్న, ఫయాజ్ పాషా, మోహన్‌రావు అభినందించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రవీంద్రబాబు

ధరూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రణాళికాబద్ధంగా చదివి వందశాతం ఉత్తీర్ణతా సాధించాలని ఎంఈవో రవీంద్రబాబు విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని ఎంపీహెచ్ఎస్, కోతులగిద్ద పాఠశాలలను ఎంఈవో ఆకస్మికంగా సందర్శించారు. ఎంపీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులతో ఎంఈవో మాట్లాడారు. మార్చి 21 నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, టైం టేబుల్ ప్రకారం చదివి అత్యుత్తమ జీపీఏ సాధించాలన్నారు. సమయం వృథా చేయకుండా చదువుతో పాటు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం కోతులగిద్ద పాఠశాలను సందర్శించిన ఎంఈవో తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

అయిజ/వడ్డేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జూలకల్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అయిజ పట్టణానికి చెందిన చాకలి మధు (45) పని నిమిత్తం కర్నూల్ నుంచి అయిజకు బైక్‌పై వస్తున్నాడు. జూలకల్ సమీపం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం రాత్రి ఘటన చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉత్సాహంగా రాళ్లు ఎత్తు పోటీలు



గుబ్బలగుండు ఎత్తిన కప్పగల్ కర్ణ



సందెరాయి ఎత్తిన మేడికొండ రాజు

అయిజ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం చేతి రాళ్లు, గుబ్బల గుండ్లు ఎత్తు పోటీలు నిర్వహించారు. పోటీలలో పది మంది పాల్గొన్నారు. మేడికొండ రాజు 105 కిలోల బరువు ఎత్తి మొదటి బహుమతిని దక్కించుకున్నారు. ఇందువాసి నాగరాజు 95 కిలోల బరువు ఎత్తి ద్వితీయ స్థానం, తప్పట్ల మొర్సు కృష్ణ 90 కిలోల బరువు ఎత్తి మూడో స్థానంలో నిలిచారు.

గుబ్బల గుండ్ల విజేతలు

గుబ్బల గుండ్ల ఎత్తు పోటీలలో ఎనిమిది మంది పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా కప్పగల్ చెందిన కర్ణ 160 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచారు. వెంకటాపూర్ లాల్‌బాషా 160 కిలోల బరువు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచారు.

ఛత్రపతి జీవితం.. మానవాళికి ఆదర్శం



గద్వాలలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు, వీహెచ్‌పీ నాయకులు



శాంతినగర్‌లో ర్యాలీ చేపట్టిన నాయకులు



జిల్లా కేంద్రంలోని పీజీ సెంటర్‌లో..

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జీవితం మానవాళికి ఆదర్శనీయమని పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పీజీ సెంటర్‌లో బుధవారం శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో చిత్రపటానికి అధ్యాపకులతో కలిసి పూలమాలవేసి నివాళి అర్పించారు.

గద్వాల టౌన్: ఛత్రపతి శివాజీ శౌర్యానికి, దేశభక్తికి ప్రతీక అని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఫణిమోహన్ రావు అన్నారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాత్రి స్థానిక కోట ఆలయంలో చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శివాజీ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు.

గట్టు: మండలంలో శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు.

ఎర్రవల్లి: మండలంలోని జింకలపల్లి శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వడ్డేపల్లి: శివాజీ నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారని ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శాంతినగర్‌లో ర్యాలీ నిర్వ హించారు.


అయిజ: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి మంత్రాలయం రహదారి, చౌరస్తా వరకు ర్యాలీ సాగింది.

మానవపాడు: మండల కేంద్రంలోని గాంధీ చౌక్ ఆవరణలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు.

అలంపూరు: పట్టణంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి సమ సమాజ సేవా ట్రస్టు సభ్యులు నివాళి అర్పించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

» బోధ మయానందాజీ మహరాజ్‌స్వామి



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న స్వామీజీ

అయిజ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు బోధమయానందాజీ మహరాజ్ తెలియజేశారు. బుధవారం మండలంలోని సంకాపూర్‌లో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన రామకృష్ణ ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. అంతకు ముందు గ్రామస్థులు మేళ, తాళాలు, మంగళహారతులతో స్వామీజిని ఆహ్వానించారు. మనిషి దైనందిన జీవితంలో ఆధ్యాత్మికత చాలా అవసరమని తెలిపారు. రోజు ఒక గంట ధ్యానం చేయాలన్నారు. అహింసా మార్గాన్ని వదిలి భక్తిమార్గంలో నడవాలని సూచించారు. రాముడు, దామోదర్, ఈశ్వర్, గోపాల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు అనుకూల బడ్జెట్

» సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

అలంపూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, ఈ దన్న అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి ఎలాంటి ప్రతిపాదనలు రూపొందించలేదని, నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు కొనే పరిస్థితి లేదన్నారు. ప్రజలు కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీ ధరలు తగ్గించాలని కోరారు. రైతుల పంట రుణాలు మాఫీ చేయడం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఈనెల 23న ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలో కార్మిక ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న కార్మికులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామి, నర్సింహ, ఆశన్న, అలీ అక్బర్, మాలిక్ భాష, జయన్న, నూర్ అహ్మద్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎండు మిరప క్వింటాలుకు రూ.25వేలు ఇవ్వాలి



ఎండు మిర్చిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

అలంపూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎండుమిర్చి పంటకు క్వింటాల్ రూ.25 వేల మద్దతు ధరను కల్పించాలని రైతు సంఘం మండల కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. మండలంలోని సింగవరంలో బుధవారం రైతులను కలిసి మాట్లాడారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్న మాట్లాడుతూ.. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి కాగా పంట మొత్తం అమ్మినా డబ్బులు రావడం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర కేవలం రూ.12 వేల లోపు మాత్రమే పలుకుతుందన్నారు. రజాక్, గోపాల్, చిన్న ఈరన్న, బాబు సాబ్, మహ్మద్, నర్సింహులు పాల్గొన్నారు.

ఐక్యత, ప్రతిభతో ఉనికిని కాపాడుకుందాం

» క్షత్రియ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ జైతానే



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ జైతానే

గద్వాల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జనాభాలో అతి తక్కువ సంఖ్యలో ఉన్న భావసార్ క్షత్రియులు ఐక్యంగా ఉంటూ ప్రతిభతో రాణించి ఉనికిని చాటుకోవాలని భావసార క్షత్రియ (రంగ్రేజ్) సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్ జైతానే అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో కులం వివరం వద్ద భావసార క్షత్రియ సమాజ్ సీరియల్ నెం. 100గా నమోదు చేయించుకోవాలని సూచించారు. బుధవారం గద్వాల పర్యటనకు వచ్చిన ఉమేష్ జైతానే స్థానిక అంబాభవానీ మాత ఆలయంలో రుక్మిణి, పాండురంగస్వామి, భవానీమాత పునర్ ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కులాల వ్యవహారాల విషయంలో కొందరు దర్జీ, మరాఠా, మరికొందరు రంగరాజులు పేర్లను నమోదు చేయించడం వల్ల ప్రభుత్వ పరంగా నమోదు చేసుకోవడంతో జనాభా నిష్పత్తి గణనీయంగా పడిపోవడంతో ప్రభుత్వం పరంగా లబ్ధి పొందలేక పోతున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉంటున్న వారు ఇక్కడి వారికి తగిన ప్రోత్సాహం ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మనోహర్ ఖైస్కర్, శ్రీకాంత్ మాలత్కర్, ఝూడే మధుకర్, భవానీ ప్రసాద్, సిద్ధేశ్వర్ రావు, ప్రభాకర్‌రావు, శేఖర్ రావు, రమేష్‌రావు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకే పథకాలు

» ఏడీవో రాజేశ్వర్ రెడ్డి



చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న ఏడీవో రాజేశ్వర్‌రెడ్డి

రాజోలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చేనేత మగ్గాలను బుధవారం జిల్లా చేనేత, జౌళీ శాఖ ఏడీవో రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణ నేతన్న పొదుపు పథకంకు దరఖాస్తు చేసుకున్న కార్మికుల జియో ట్యాగ్ ప్రకారం వారు చేనేత మగ్గాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. నిజమైన చేనేత కార్మికులకు లబ్ధి పొందాలన్న ఉద్దేశంతో మగ్గాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మగ్గం పని చేసే ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని చెప్పారు. మొత్తం 2,196 మంది దరఖాస్తులు చేసుకోగా బుధవారం సాయంత్రంకు 250 మగ్గాలను పరిశీలించామని, 500 మంది చేనేత కార్మికుల పరిశీలన పూర్తయ్యిందన్నారు. ఈ నెలాఖరులో బ్యాంక్‌లో ఆర్డీ ఖాతాలు తెరిపిస్తామని చెప్పారు. సీడీఈ శివకుమార్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కార్యదర్శి గంటా కవితాదేవి

» న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి గంటా కవితా దేవి

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తమపై పూర్తి నమ్మకంతో ఉన్న తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు లక్ష్య సాధనతో ముందుకెళ్లాలని న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి గంటా కవితాదేవి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయాన్ని బుధవారం రాత్రి ఆమె ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనంతో పాటు బోధనపై వారిని పలకరిస్తూ తెలుసుకున్నారు. కృషి, పట్టుదల, ఏకాగ్రత, పోటీతత్వం ఉంటే విజయం తమ సొంతం అవుతుందని హితవు పలికారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు గురికావొద్దని సూచించారు. ప్రధానంగా సెల్‌ఫోన్‌లను చదువు కొరకు మాత్రమే ఒక వనరుగా వినియోగించుకోవాలని, అనవసరంగా వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను లింగ వివక్షతో చూడరాదన్నారు. బాల్య వివాహాలు చేస్తే జైలుకెళ్తారని హెచ్చరించారు. తల్లిదండ్రులు పెళ్లి విషయంలో బలవంతం చేస్తే ఆందోళన చెందకుండా తమ దృష్టికి తీసుకురావాలని, వివరాలు రహస్యంగా ఉంచుతామని తెలిపారు.